www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 6 అక్టోబర్ 2025
5
ఏలూరు



6న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల పర్యటన



ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ నెల 6వ తేదీ ఏలూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నెల ఆరో తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు ఏలూరు సర్ సిఆర్ రెడ్డి డిగ్రీ కాలేజీ ఆడిటోరియంలో జరిగే స్వచ్ఛాంధ్ర అవార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎంఎల్ఎలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పాల్గొంటారు.

350 ఎకరాలు బీడు పెట్టేశారు..!

- నిరుపయోగంగా మారిన వట్లూరు భూములు
- రైతులకు చిల్లిగవ్వ పరిహారం ఇవ్వని సర్కార్
- 9 ఏళ్లుగా సాగు లేదు.. పరిశ్రమలు ఏర్పాటు చేయని పరిస్థితి
- నష్టపోయిన రైతాంగం.. కోర్టు పరిధిలోకి సమస్య
- సమస్యను పరిష్కరించలేని స్థితిలో జిల్లా అధికారులు, పాలకులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రైతుల సాగులో ఉన్న 350 ఎకరాల భూములను పరిశ్రమల పేరుతో రైతుల నుంచి బలవంతంగా లాక్కుని, చిల్లిగవ్వ పరిహారం ఇవ్వకుండా తొమ్మిదేళ్లుగా బీడు పెట్టేసిన పరిస్థితి పెదపాడు మండలం వట్లూరులో నెలకొంది. తొమ్మిదేళ్లల్లో వేల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి దెబ్బతినడంతోపాటు, ఆ భూములు సాగు చేసుకునే రైతులు తీవ్రంగా నష్టపోయిన పరిస్థితి ఏర్పడింది. సమస్య కోర్టులో ఉందన్న కారణం చూపుతూ భూములు రైతులకు ఉపయోగం లేకుండా, పరిశ్రమలు నెలకొల్పకుండా వందల ఎకరాల భూములను నిరుపయోగంగా మార్చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 2016లో పెదపాడు మండలం వట్లూరు పెదచెరువు భూముల్లో వెమ్ టెక్నాలజీ (విమాన విడిభాగాల తయారీ) పరిశ్రమ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వట్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 495, 496, 497లోనూ, పెదవేగి మండలంలోని సర్వే నెంబర్ 210-29 పరిధిలో మొత్తం 350 ఎకరాలను వెమ్ టెక్నాలజీ సంస్థకు ఎపిఐఐసి ద్వారా కేటాయించారు. ఈ భూములను దాదాపు 300 మంది సన్న, చిన్న కారు రైతులు దశాబ్దాల తరబడి సాగు చేసుకుంటున్నారు. రికార్డుల ప్రకారం ఇవి వట్లూరు పెద చెరువు భూములుగా ఉన్నాయి. చట్ట ప్రకారం చెరువు భూములైనప్పటికీ రైతుల స్వాధీనంలో ఉన్నప్పుడు పరిహారం చెల్లించి తీసుకోవాలి. అప్పట్లో ప్రభుత్వం అత్యంత దారుణంగా ముందుకు సాగింది. రైతులకు ఎటువంటి పరిహారం ఇవ్వకుండా భూములను లాగేసుకుంది. దీంతో రైతులు ఆందోళనకు దిగి పెద్ద ఎత్తున పోరాటం సాగించారు. ఈ క్రమంలో ఎకరాకు రూ.2.50 లక్షలు పరిహారం ఇచ్చేలా నిర్ణయించారు. తొమ్మిదేళ్లు గడిచినా ఇప్పటి వరకూ రైతులకు చిల్లిగవ్వ పరిహారం ఇవ్వలేదు. సాగుచేసుకుంటున్న భూములను ప్రభుత్వం లాగేసుకోవడంతో ఎన్నో కుటుంబాలు ఆర్థిక ఆసరాను కోల్పోయి చితికిపోయాయి. 2019 ఎన్నికల్లో టిడిపి ఓటమిపాలైంది. అధికారంలోకి వచ్చిన వైసిపి రైతుల గురించి పట్టించుకోలేదు. పరిశ్రమ ఏర్పాటు సైతం జరగలేదు. 2022లో వెమ్ టెక్నాలజీతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకుని ఆ భూములను ఎపిఐసిసి స్వాధీనం చేసుకుంది. దీనిపై కొంతమంది రైతులు కోర్టుకు వెళ్లారు.

సమస్య తీరేదెప్పుడు.. రైతులకు న్యాయం జరిగేదెప్పుడు..

వట్లూరు భూముల సమస్యను పరిష్కరించడంలో జిల్లా అధికారులు, ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. రైతులకు పరిహారం అందించి.. ఆ భూములను ఉపయోగంలోకి తీసుకురాని పరిస్థితి నెలకొంది. చెరువు భూములను పరిశ్రమలకు కేటాయించడం చట్ట ప్రకారం చెల్లదు. తెలిసి కూడా అప్పట్లో ఆ భూములను ఎపిఐఐసికి అప్పగించారు. రైతులు సాగులో ఉండి ఉంటే తొమ్మిదేళ్లలో వేల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి జరిగేది. దీనివల్ల ప్రభుత్వానికి, రైతులకు ఎంతగానో మేలు జరిగేది. ఎటువంటి ఆలోచన లేకుండా ప్రభుత్వం చేసిన పని కారణంగా 350 ఎకరాల సాగు భూమి బీడుగా మారిపోయింది. ఇప్పటికీ రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదు. ఈ ఏడాది జనవరి 16న జరిగిన డిఆర్‌సి సమావేశంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ వట్లూరు భూముల ప్రస్తావన తెచ్చారు. దీనిపై పూర్తి వివరాలు ఇవ్వాలంటూ ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులకు ఆదేశాలు సైతం జారీ చేశారు. పది నెలలు గడిచిపోతున్నా ఇప్పటి వరకూ ఏం జరిగిందో ఏ ఒక్కరికీ తెలియని పరిస్థితి నెలకొంది.

నెలాఖరు నుంచి ధాన్యం కొనుగోలు

- ఖరీఫ్‌లో 4 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం
- కోటి వరకూ సంచులు అవసరం.. అందుకు తగిన ఏర్పాట్లు
- దళారీ వ్యవస్థను నిర్మూలించి.. రైతులకు మేలు చేసేలా చర్యలు
- వాట్సాప్ షెడ్యూల్ ద్వారా కొనుగోలుకు ప్రణాళికలు
- క్యూఆర్ కోడ్ ఫీడ్‌బ్యాక్ మెకానిజంతో రైతుల అభిప్రాయాల సేకరణ
- పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ పి.శివరామమూర్తి





ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఈ నెలాఖరు నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా పూర్తిస్థాయిలో చర్యలు చేపడుతున్నామని పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ పి.శివరామమూర్తి తెలిపారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు టార్గెట్, ఎన్ని సంచులు అవసరం పడనున్నాయి? రవాణా ఏర్పాట్లు, జిల్లా వ్యాప్తంగా ఎన్ని కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు జరగనుంది? వాట్సాప్ షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలు, రైతుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్ ఫీడ్ బ్యాక్ మెకానిజం వంటి పలు విషయాలను 'ప్రజాశక్తి' జరిపిన ముఖాముఖిలో డిఎం వివరించారు.

ప్రశ్న: ఖరీఫ్‌లో జిల్లాలో ఎంత ధాన్యం దిగుబడి రానుంది? ఎంత ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు?

డిఎం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 5.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

ప్రశ్న: ధాన్యం కొనుగోలును ఎప్పటి నుంచి ప్రారంభం చేయనున్నారు? ఎన్ని కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ జరగనుంది?

డిఎం: అక్టోబర్ నెలాఖరు నుంచి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నాం. 240 వరకూ ఆర్‌బికెలు, 130 సహకార సంఘాల్లో కొనుగోలు ప్రక్రియ జరగనుంది.

ప్రశ్న: ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలుకు ఎన్ని సంచులు అవసరం కానున్నాయి? సంచులు సిద్ధం చేశారా?

డిఎం: ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు కోటి సంచుల వరకూ అవసరం ఉంది. మిల్లర్ల వద్ద సంచులు సిద్ధం చేసి ఉంచుతున్నారు.

ప్రశ్న: తేమ శాతం నిర్ధారణకు సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిఎం: తేమశాతం నిర్ధారణకు సంబంధించి గతంలో మాదిరిగానే మీటర్లు ఏర్పాటు చేస్తున్నాం. అవే మీటర్లు మిల్లర్ల వద్ద ఉంటాయి.

ప్రశ్న: గడిచిన రబీలో జిల్లాలో ఎంత ధాన్యం కొనుగోలు జరిగింది? ఎంత సొమ్ము రైతులకు చెల్లించారు?

డిఎం: రబీలో 2.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. మొత్తం రూ.583 కోట్ల చెల్లింపులు జరిగాయి. గతంలో ఎన్నడూలేని విధంగా 48 గంటల్లోనే ధాన్యం సొమ్ములు జమ కావడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమైంది.

ప్రశ్న: ధాన్యం రవాణా ఏర్పాటుకు సంబంధించి ప్రక్రియ ఎలా సాగనుంది?

డిఎం: రవాణా ఏర్పాట్లు రైతులు చేసుకుంటే అందుకు సంబంధించిన కిరాయి సొమ్ములు చెల్లించడం జరుగుతోంది. ధాన్యం జట్టు ఖర్చే సొమ్ములు సైతం రైతులకు ప్రభుత్వం ఇస్తోంది.

ప్రశ్న: రైతులకు పూర్తిస్థాయి మద్దతు ధర అందాలంటే ఏం చేయాలి?

డిఎం: దళారులు చెప్పే మాటలు రైతులు నమ్మొద్దు. నాణ్యత ప్రమాణాలు పాటించి మద్దతు ధర దక్కేలా చూసుకోవాలి. దీనిపై రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న: ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు ఏమైనా నిర్వహించారా?

డిఎం: ఈ వారంలో ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమం జరుగనుంది.

ప్రశ్న: ధాన్యం కొనుగోలు సులువుగా జరిగేలా ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా?

డిఎం: వాట్సాప్ విధానం అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాం. పౌర సరఫరాల శాఖ ఇచ్చిన వాట్సాప్ నెంబర్‌కు హాయ్ అని పెడితే సంబంధిత వివరాలు వస్తాయి. అందులో ధాన్యానికి సంబంధించిన వివరాలు నమోదు చేస్తే కొనుగోలు ప్రక్రియ చేపట్టడం జరుగుతుంది.

ప్రశ్న: ధాన్యం కొనుగోలుపై రైతుల అభిప్రాయాలు తీసుకునే ఏర్పాటు చేశారా?

డిఎం: క్యూఆర్ కోడ్ ఫీడ్ బ్యాక్ మెకానిజం ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద క్యూఆర్ కోడ్ ఉంటుంది. స్కాన్ చేసి రైతులు తమ అభిప్రాయాలు చెప్పే అవకాశం ఏర్పాటు చేస్తున్నాం.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో చంద్రబాబు విఫలం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఆదివారం సిపిఐ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి విభజిత ఆంధ్రప్రదేశ్‌కు రెండోసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత పోలవరం ప్రాజెక్టు 2027కు పూర్తి చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులను సకాలంలో వినియోగించి యుటిలైజేషన్ సర్టిఫికెట్ ఇవ్వలేని స్థితిలో ఉండి 2027కు పోలవరం ప్రాజెక్టు ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉన్న ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు 45.72 మీటర్ల నుండి 41.15 మీటర్లకు ఎత్తు తగ్గిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎందుకు ప్రశ్నించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రాధాన్యతా క్రమంలో జరిపేందుకు, నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఆంధ్రప్రదేశ్‌లో కూడా జనగణనతో పాటు కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజకీయంగా వెనుకబడిన వర్గాలకు జనగణనతో పాటు కులగణన చేస్తేనే న్యాయం జరుగుతుందన్నారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి అక్కినేని వనజ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏలూరు జిల్లాలో ఏజెన్సీ ప్రాంతమైన జీలుగుమిల్లిలోని 5 గ్రామాల్లో నేవీ ఆయుధం డిపో ఏర్పాటు చేసి గిరిజనులకు తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. 32 మంది ఆత్మ బలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరణ చేయాలనే దురుద్దేశంతో దాన్ని కేంద్రం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. గత ఎన్నికల సమయంలో విశాఖ ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణ కానీయబోమంటూ అప్పటి కూటమి నేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తో పాటు, లోకేష్ ప్రకటించిన విషయాన్ని తెలిపారు.అధికారంలోకి వచ్చాక వారి మాటలు నీటి మూటలు అయ్యాయని విమర్శించారు. సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఐటిడిఎ పరిధిలో గిరిజనులు అనేక దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు పంపిణీ సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఎపి గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వం డ్రైవర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

సిపిఎం జిల్లా కమిటీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కూటమి ప్రభుత్వం లైసెన్స్ ఉన్న ఆటో, క్యాబ్, బస్, లారీ, టిప్పర్ డ్రైవర్లందరికీ సంవత్సరానికి రూ.15,000 ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆచరణలో ఆటో, క్యాబ్ వాహన యజమానులకు మాత్రమే ఏలూరు జిల్లాలో 15000 రూపాయలు చొప్పున 10,655 మందికి ఇచ్చారని తెలిపారు. ఎన్నికల ముందు రవాణా రంగ కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, అధిక ఫెనాల్టీలకు అవకాశం కల్పించిన జిఒ నెంబర్ 21ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని పేర్కొన్నారు. 15 నెలలు గడుస్తున్నా సంక్షేమ బోర్డు విధి విధానాల కోసం ప్రాథమికంగా ఒక కమిటీని కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చి ఇంత వరకూ తగ్గించింది లేదని విమర్శించారు. ప్రయివేటు సంస్థలు ఇష్టానుసారంగా ఫిట్నెస్ సర్టిఫికెట్లు జారీ చేయడం జరిగితే ప్రజల ప్రాణాలకు రక్షణ ఉండదని తెలిపారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.4 లక్షల వరకూ సబ్సిడీతో కూడిన రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తమది మంచి ప్రభుత్వం అని చెప్పుకోవడం మోసపూరితమని విమర్శించారు. ప్రస్తుతం వాహన యజమానులకు, ఆటో డ్రైవర్లకు సేవా పథకం ద్వారా ఇచ్చిన 15 వేల రూపాయలు రోజుకు 41 రూపాయలు మాత్రమేనని, తాము నష్టపోయిన ఆదాయంతో పోల్చుకుంటే ఇది ఏ మూలకూ సరిపోదని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, జిఒ 21ను రద్దు చేయాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని, రహదారులకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో ఆటో, క్యాబ్, బస్సు, లారీ, టిప్పర్ డ్రైవర్లు చేసే ఉద్యమాలకు సిపిఎం అండగా ఉంటుందని ప్రకటించారు.

గాయపడ్డ ఎలక్ట్రీషన్‌కు వైద్యం, ఆర్థిక సహాయం అందించాలి

కామవరపు కోట మండలం ఆడమిల్లిలో విద్యుత్ షాక్‌తో గాయపడ్డ ప్రయివేటు ఎలక్ట్రీషన్ బి.వంశీకి పూర్తి వైద్యం, ఆర్థిక సహాయం అందించేలా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కమిటీ కోరింది. ఆడమిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మద్దుకూరు ఫీడర్ వద్ద తెగిపోయిన జంపర్ సరిదిద్దే ప్రయత్నంలో విద్యుత్ షాకుకు గురై తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. అక్కడ ఏర్పడిన సాంకేతిక సమస్యకు కూడా అధికారులే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. సాంకేతిక విషయాలతో ముడి పెట్టకుండా విద్యుత్ శాఖ, ప్రభుత్వం ఎలక్ట్రీషన్ వంశీకి పూర్తి వైద్యం అందించడంతో పాటు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

నేడు యధావిధిగా పిజిఆర్ఎస్

కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా, ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో అక్టోబర్ ఆరో తేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి యధావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. దీని ద్వారా ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల, డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చని తెలిపారు. ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం అధికారిక వెబ్‌సైట్ https://meekosam.ap.gov.in ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు. ఈ వ్యవస్థ వల్ల ప్రజల సమస్యలు తక్షణమే సంబంధిత అధికారులకు చేరి, సమయానుకూలంగా పరిష్కారమవుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు గుర్తించి పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.



పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలో 1982-83 సంవత్సరంలో ఎస్ఆర్ఆర్ జెడ్‌పి హెచ్ స్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కొన్నంగుంట రోడ్డు తాతినేని సురేష్ గార్డెన్‌లో కాకినాడ ఎఎస్‌పిగా (ఎఆర్) పని చేస్తున్న సింగంపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను పంచుకుంటూ స్నేహితులను, కలుసుకునే కార్యక్రమంలో ఉత్సాహ కేరింతల మధ్య వారి కుటుంబ నేపథ్య పరిస్థితులను తెలియపరుచుకుంటూ పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాకినాడ ఎఎస్‌పి (ఎఆర్) సింగంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ 42 ఏళ్ల మైత్రి దమదని, ఎవరికి ఏ కష్టం వచ్చినా వివిధ డిపార్ట్‌మెంట్‌లో చదివి ఉన్నత స్థానంలో ఉన్న మిత్రులందరి సహకారంతో అందరం ముందుకెళ్తామని తెలిపారు. మనలో చాలామంది పూర్వ విద్యార్థులు కష్టపడి పనిచేస్తూ స్వయం కృషితో చదువుకోవటం వల్లే మన మిత్రుల్లో 90 శాతం మంది ఉన్నత స్థానాలకు చేరుకోగలిగారని, చదువును నమ్ముకున్న ప్రతిఒక్కరూ ఉన్నత స్థాయికి తప్పకుండా చేరుకుంటారని అందుకు మనమే ఉదాహరణ అని, ఇంత చక్కగా ఆర్గనైజింగ్ చేసిన మోత్రు శ్యాంబాబు, మరీదు సాంబ, నీలం నాగేశ్వరం ~వు, షేక్ రెహమాన్‌లను అభినందించారు. అనంతరం ఆస్ట్రేలియా, ముంబై,హైదరాబాదు, వైజాగ్, రాజమండ్రి దూర ప్రాంతాల నుంచి వచ్చిన మిత్రులందరితో పాటు హాజరైన అందరికీ నూతన వస్త్రాలతో పాటు ఆయన మెమొంటోళ్లను అందిం చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 78 మంది మిత్రులు కార్యక్రమంలో తమ అనుభవాలను పంచుకున్నారు.

మా ఆరోగ్యాన్ని కాపాడండి..!

- పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి వస్తున్న వ్యర్థపు నీరు
- స్థానికుల అవస్థలు
- అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన
- పంట నాశనమవుతుందని రైతుల ఆందోళన
- అధికారులు స్పందించాలని వేడుకోలు



ప్రజాశక్తి - చింతలపూడి

పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థాల వల్ల నీరు కలుషితం కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. పామాయిల్ ఫ్యాక్టరీ వల్ల వచ్చే వర్థపు నీరు చెరువులో కలవడంతో ఆ నీటిని పశువులు తాగడంతో పాలు తక్కువ ఇస్తున్నాయని పాడి రైతులు చెబుతున్నారు. వ్యర్థపు నీటిలో దిగడంతో ఇన్ఫెక్షన్స్ వస్తుందని, ఆసుపత్రికి వెళ్తే రూ.వేలల్లో ఖర్చవుతుందని రైతులు, పశువుల కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు దురదలు, గజ్జి, తామర వంటి చర్మ వ్యాధులకు గురవుతున్నారని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాడే మందులతో పాటు నీరు కలుషితం అవ్వడంతో అనారోగ్యానికి అందుకు కూడా మందులు వాడేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గర్భిణులు వాపోతున్నారు.

మండలంలోని సీతానగరం, చింతంపల్లి గ్రామంలో ఉన్న పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థపు నీటి వల్ల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనారోగ్య సమస్యలకు గురై అవస్థలు పడుతున్నారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థపు నీరు చెరువులోకి వెళ్లడంతో చెరువులో నీరు కలుషితం అవ్వడంతో పాటు చెరువు నుంచి పొలాల్లోకి, అక్కడ నుంచి ఎస్‌సి కాలనీలోకి వెళ్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో పెట్టుబడులు ఎక్కువవుతున్నాయని, దిగిబడులు తగ్గుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే రకంగా ఫ్యాక్టరీ నీరు వస్తే తోటలు వదిలేసి వెళ్లిపోతామని కౌలు రైతులు వాపోతున్నారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే వర్థపు నీరు వల్ల దురదలు, గజ్జి, తామర వంటివి వస్తున్నాయని ఎస్‌సి కాలనీవాసులు చెబుతున్నారు. రోజు కూలి పనులకు వెళ్తున్నామని ఆ డబ్బులు మందులకు సరిపోతున్నాయని ఆవేదన చెందుతున్నారు. అంతేకాకుండా ఫ్యాక్టరీలో చదువుకున్న స్థానికులకు ఉద్యోగాలు ఇస్తామని మాట ఇచ్చి బయటవారికి అవకాశాలు ఇస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. గ్రామంలో హాస్పిటల్ కట్టిస్తామని హామీ ఇచ్చి నేటి వరకు ఆ మేరకు చర్యలు తీసుకోలేదని, నెలకోసారి హెల్త్ మెడికల్ క్యాంపు పెడతామని చెప్పి అసలు ఆ ప్రయత్నమే చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొర్రెలు, గేదెలు, ఇతర రుణాలు గ్రామస్తులకు ఇస్తామని హామీ ఇచ్చి రుణాలు కూడా ఇవ్వడంలేదని, గ్రామస్తులకు ఉపాధి కల్పిస్తామని, ఉపాధి కల్పించటం లేదని, ఫ్యాక్టరీ వద్ద ఏదైనా సమస్య జరిగితే వచ్చి హామీలు ఇచ్చి వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్‌సి కాలనీ వాసులు ఫ్యాక్టరీ వల్ల వచ్చే సమస్య, ఇబ్బందులు చెప్పుకోవడానికి వెళ్తే కనీసం లోపలికి రానివ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమను కనీసం మనుషుల్లా చూడటం లేదని వాపోతున్నారు. సమస్యలపై, ఇబ్బందులపై గ్రామస్తులు పోరాటం చేస్తే కొందరు వచ్చి న్యాయం చేస్తామని, ఫ్యాక్టరీ వారితో మాట్లాడతామని చెప్పి ఎవరూ పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించిన తమ సమస్యలను పరిష్కరించిన ఇబ్బందులను తొలగించాలని ఎస్‌సి కాలనీ వాసులు, రైతులు కోరుతున్నారు.

చులకనగా చూస్తున్నారు

బి.స్వప్న, సీతానగరం

ఎస్‌సి కాలనీ ప్రజల సమస్యలు ఎవరూ పట్టించుకోవటం లేదు. కంటి తుడుపు చర్య కింద ఒక్కరోజు మెడికల్ క్యాంపు పెట్టి చేతులు దులుపుకుంటున్నారు. స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు ఇవ్వటం లేదు. మా సమస్యలు, ఇబ్బందులు చెప్పుకోవడానికి వెళ్తే కనీసం ఫ్యాక్టరీ లోపలకి రానియడంలేదు. చాలా చులకనగా చూస్తున్నారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే వర్థపు నీరు వల్ల అనారోగ్యానికి గురైనా ఎవరూ పట్టించుకోవడంలేదు. అధికారులు స్పందించి మా సమస్యలు పరిష్కరించాలి.

చర్మ వ్యాధులు వస్తున్నాయి

బచ్చిన చినలక్ష్మి, సీతానగరం

ఫ్యాక్టరీ వల్ల వచ్చే వ్యర్థపు నీరు వర్షపు నీటితో కలిసి కలుషితమై దురదలు, గజ్జి, ఇతర చర్మ వ్యాధులు వస్తున్నాయి. మా కుటుంబంలో అందరకీ శరీరంపై దద్దుర్లు వచ్చాయి. ఈ సమస్యను అధికారులు పరిష్కరించాలి.

పంట దిగుబడులు తగ్గుతున్నాయి

సుబ్బారావు, రైతు, సీతానగరం

పామాయల్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే వర్థపు నీరు పొలాల్లోకి చేరడంతో పంట దిగుబడులు తగ్గుతున్నాయి. ఆ నీటిలో దిగితే చర్మ వ్యాధులు వస్తున్నాయి. ఫ్యాక్టరీ నుంచి వచ్చే నీటిని అరికట్టాలి. అధికారులు స్పందించి నీరు రాకుండా చర్యలు తీసుకోవాలి.

రూ.50 వేలు ఖర్చయ్యింది

నందిపం భద్రం, రైతు, సీతానగరం

నాకు చిన్న దెబ్బ తగిలింది. పామాయల్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే నీటిలో కాళ్లు తడిచింది. దీంతో ఇన్ఫెక్షన్ అయింది. ఆసుపత్రికి వెళ్తే రూ.50 వేలు ఖర్చయింది. ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థపు నీటిని అరికట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

హామీలు అమలు చేయాలి

ఉమ్మడి సుజాత, సీతానగరం

ఎస్‌సి కాలనీలో సమస్యలు ఎవరూ పట్టించుకోవటం లేదు. ఏదైనా సమస్య జరిగితే వచ్చి కంటి తుడుపు చర్యలు చేస్తున్నారు. కనీసం ఉపాధి అయినా కల్పించాలి. ఎస్‌సి కాలనీకి ఇచ్చిన హామీలు అమలు చేయాలి.

బాణసంచా తయారీ కేంద్రాలపై తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ఐదేశాల మేరకు నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్ పర్యవేక్షణలో నూజివీడు రూరల్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ పోలీస్ సిబ్బందితో కలిసి నూజివీడు రూరల్ సర్కిల్ పరిధిలో బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాలపై ఆదివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ మాట్లాడుతూ దీపావళి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో కొందరు వ్యక్తులు అక్రమంగా బాణసంచా తయారీ, నిల్వ లేదా విక్రయాలు చేపడుతున్నట్లు సమాచారం అందిందని చెప్పారు. దీంతో బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాణసంచా తయారీకి సంబంధించిన కేంద్రాలు అధికారుల అనుమతులతో మాత్రమే నడపాలని, పేలుడు పదార్థాలు నిల్వ చేసేటప్పుడు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. అనుమతులు లేని వారు తయారీ లేదా విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి అక్రమ బాణసంచా తయారీ లేదా నిల్వ జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే డయల్ 112కు లేదా నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. బాణసంచా తయారీ కేంద్రాల వద్ద సదరు కేంద్రాల యజమానులు ఇసుకను నీటిని అందుబాటులో ఉంచాలని, ఎటువంటి ప్రమాదాలు సంభవించిన ఎదుర్కోవడానికి కావాల్సిన చర్యలను తీసుకోవాలని సూచించారు. 18 ఏళ్ల లోపు మైనర్ బాలబాలికలను తయారీ కేంద్రాల వద్ద, విక్రయాల వద్ద వినియోగించరాదని, దానికి విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత బాధపడే కంటే జరగకుండా తగిన చర్యలు తీసుకోవడం చాలా శ్రేయస్కరమన్నారు. ప్రజల ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా ప్రభుత్వం అనుమతులు పొందిన వారి మాత్రమే బాణసంచా నిల్వలు, తయారీ చేయాలని సూచించారు. బాణసంచా తయారీలో అజాగ్రత్త వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుందని, చిన్న పొరపాటు కూడా ప్రాణ నష్టం కలిగించవచ్చని, ఎవరూ చట్ట విరుద్ధంగా బాణసంచా తయారీ, నిల్వలు చేయరాదని, పిల్లలు, యువతులు సురక్షితంగా దీపావళి జరుపుకోవాలని చెప్పారు. నూజివీడు రూరల్ పోలీస్ సిబ్బంది ఈ తనిఖీలను కొనసాగిస్తూ ప్రజల భద్రత కోసం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారని తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

6, 7 తేదీల్లో జాటోత్ హుస్సేన్ పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు



జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు శ్రీ జాటోత్ హుస్సేన్ ఈ నెల 6, 7 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారు. అ నెల ఆరో తేదీ సోమవారం ఉదయం 7.30 గంటలకు రాజమహేంద్రవరం నుంచి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి గోపాలపురం, కొయ్యలగూడెం, కన్నాపురం, బుట్టాయగూడెం, దోరమమిడి, అలివేరు మీదుగా మోధెల గ్రామానికి చేరుకుంటారు. ఉదయం 11.30 మోధెలలో స్థానిక షెడ్యూల్డ్ తెగల సంఘాల ప్రతినిధుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు రామన్నగూడెం మీదుగా లంకపాకల ఆశ్రమ పాఠశాల చేరుకుని పాఠశాలను సందర్శిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు లంకపాకల నుంచి కోటరామచంద్రాపురం చేరుకుని అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. కోటరామచంద్రాపురంలో రాత్రి బస చేస్తారు. ఈ నెల ఏడో తేదీ మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు కోటరామచంద్రాపురంలో పునరావాస కార్యక్రమాల ప్రణాళిక అంశంపై అధికారులతో సమావేశమవుతారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఏలూరు జిల్లా కలెక్టర్, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్, అటవీ అధికారి, విద్యుత్ శాఖ, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమావేశంలో పాల్గొంటారు. అదేరోజు సాయంత్రం 5.30 గంటలకు కోటరామచంద్రాపురం నుండి రోడ్డు మార్గం ద్వారా రాజమహేంద్రవరం బయలుదేరి వెళ్తారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏజెన్సీ ఏరియాలో పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులకు, గిరిజనేతరులకు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ అక్టోబర్ 22న ఐటిడిఎ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. స్థానిక స్ఫూర్తి భవనంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం కారం ధారయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ మండలంలోని వంకవారిగూడెంలో నిర్మించనున్న నేవి ఆయుధ డిపోపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకోవడానికి అక్టోబర్ 9వ తేదీన ఐదు గ్రామాల్లోని ప్రజలను సిపిఐ నాయకత్వం కలుసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి మున్నీర్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

హత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం బైనేరు వాగు వద్ద ఈ నెల మూడో తేదీన పాత నేరస్తుడు కర్రి రాజేష్(26) అనే వ్యక్తిని హత్య చేసిన ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మార్కండేయపురం గ్రామానికి చెందిన కర్రి రాజేష్‌ను ఇటీవల కొందరు వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. ఈ హత్య కేసులో జంగారెడ్డిగూడేనికి చెందని షేక్ ఖాసిం, సుబ్బంపేటకు చెందిన షేక్ నాగూర్ మీరా, జంగారెడ్డిగూడేనికి చెందిన వాముశెట్టి రామచంద్ర పవన్ కుమార్, సమ్మగి మంగరాజు, షేక్ జహీరుద్దీన్, మరీదు సాయిలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన రెండు చాకులు, మూడు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై పలు పోలీస్‌స్టేషన్లో పాత కేసులు ఉన్నాయని చెప్పారు. నిందితులపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని డిఎస్‌పి తెలిపారు. తదుపరి చట్టపరిమైన చర్యల నిమిత్తం న్యాయస్థానంలో హాజరు పరుస్తారని తెలిపారు. డిఎస్‌పి రవిచంద్ర దర్యాప్తు అధికారి ఎంవి.సుభాష్, సహరించిన సిబ్బందికి రివార్డు కోసం ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్‌కు సిఫారసు పంపినట్లు తెలిపారు.

కొనసాగుతున్న గాలింపు చర్యలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలో అదృశ్యమైన వృద్ధ మహిళ వీరంకి విమల (65)ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల మూడో తేదీ శుక్రవారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వచ్చిన వృద్ధురాలు విమల సమీపంలో పోల్‌రాజ్ కాలువలో స్నానం చేస్తూ గల్లంతైనట్లు స్థానికుల సమాచారం మేరకు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మూడు రోజులుగా ఆచూకీ కోసం కైకలూరు అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. అయినప్పటికీ విమల ఆచూకీ తెలియరాలేదు. కాకినాడ నుంచి వచ్చిన ఎన్‌డిఆర్‌ఎఫ్ ప్రత్యేక బృందం సభ్యులు ఆదివారం ముదినేపల్లి నుంచి దాకారం వరకు కాలువల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఆచూకీ తెలియ రాలేదు. ఆర్ఐ రాజశేఖర్, విఆర్ఒ హనుమంతరావు, గ్రామ ఉపసర్పంచి ఈడే సుధాకర్ గాలింపు చర్యలు పర్యవేక్షిస్తున్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తపై టి.నరసాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వెలగపాడు పంచాయతీలోని వీరభద్రవరం గ్రామానికి చెందిన గురజాల గంగాభవానికి అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావుతో 2017లో వివాహమైంది. వివాహ సమయంలో గంగాభవాని తల్లిదండ్రులు రూ.1.55 లక్షల నగదు, రెండు కాసుల బంగారం కట్నంగా ఇచ్చారు. కొంత కాలం సంసారం సజావుగా సాగింది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల వెంకటేశ్వరరావు చెడు వ్యసనాలకు అలవాటు పడి అదనంగా రూ.రెండు లక్షల నగదు కొంత భూమి తన పేరున కొని ఇవ్వాలని తల్లి వీర నాగతో కలిసి శారీరకంగా మానసికంగా వేధిస్తున్నారని, 2024 నవంబర్ 13వ తేదీన ఇంటిలో నుండి గెంటి వేశారని, పెద్దల సమక్షంలో మాట్లాడడానికి ప్రయత్నించినా నిరాకరించడంతో భార్య గురజాల గంగాభవాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాత కక్షలతో మహిళపై దాడి

ప్రజాశక్తి - ముదినేపల్లి

పాత కక్షల నేపథ్యంలో మహిళపై దాడి చేసిన సంఘటన మండలంలోని చిగురుకోట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన అల్లాడి గోపీ లక్ష్మి, తుమ్మ నాగ వెంకట తిరుపతమ్మ కుటుంబానికి గతంలో పాత గొడవలు ఉన్నాయి. ఈ నెల రెండో తేదీ సాయంత్రం ఆరు గంటలకు గోపీలక్ష్మి తన బజారులోని అమ్మవారి ఊరేగింపు చూసుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా, తుమ్మ నాగ వెంకట తిరుపతమ్మ అకారణంగా గోపీలక్ష్మిపై గొడవపడి తిట్టి, జుట్టు పట్టుకుని కిందపడవేసి, చేతులతో కొట్టినట్లు, అలాగే గంజాల శ్రీరామకృష్ణ కూడా గోపీలక్ష్మి గొంతుపై కాలు వేసి తొక్కినట్లు, అంతట గోపీలక్ష్మి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి విడదీశారు. గోపీలక్ష్మి గుడివాడ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ఆసుపత్రి నుంచి ఆదివారం వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పెదవేగి మండలంలో పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. పెదవేగి సిఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెదవేగి మండలం న్యాయంపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పెదవేగి సిఐ రాజశేఖర్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.9,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిఐ రాజశేఖర్ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాల వివరాలు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైన ఉందన్నారు. అటువంటి వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, వివరాలను 112 నెంబర్‌కు తెలియజేయాలని సూచించారు. అంతేకాకుండా అక్రమ మద్యం, అక్రమ రవాణా వంటి వివరాలను కూడా తమకు తెలియజేయాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న ఎవరి వివరాలైనా సరే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

రహదారి.. ప్రమాదంగా మారి..!

గోతులమయంగా నూజివీడు-ఏలూరు రోడ్డు
వాహనదారుల అవస్థలు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ముసునూరు

నూజివీడు నుంచి ఏలూరు వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బి రహదారి పెద్ద పెద్ద గుంతలతో ప్రమాదకరంగా మారింది. ఆ రహదారిపై పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాదిన్నర అవుతున్నా రోడ్లు అధ్వానంగానే ఉన్నాయని విమర్శలు చేస్తున్నారు. బైకులు, కార్లు, లారీలు ఏ పెద్ద వాహనమైనా రోడ్డుపై నడిపించే సరిస్థితి లేదని వాహనదారులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే సంక్రాంతి పండుగ నాటికి గోతులు లేకుండా చేస్తామని ప్రగల్భాలు పలికిన పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామానికి రావాలంటే మండలంలోని మిగతా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలతో పాటు మార్జిన్లు కూడా పాడైపోవడంతో జిల్లా కేంద్రమైన ఏలూరు పట్టణానికి వెళ్లాలన్నా పలు ప్రమాదాలకు గురవుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. అదేవిధంగా రైతులు తమ పంట పొలాల్లో పండించిన పంట ఏలూరు, నూజివీడు వంటి పట్టణాలకు తీసుకెళ్లే సమయంలో రోడ్డుపై గుంతలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా వర్షాలు కురిసినప్పుడు పెద్ద పెద్ద గుంతల్లో వర్షపు నీరు చేరి ఆ గుంతలు ఏ లోతులో ఉన్నాయో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు పథకం రావడంతో ప్రయాణికులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రోడ్లు అధ్వానంగా ఉండడంతో ఆటో మరమ్మతులకు గుర్రై ఎక్కువ ఖర్చవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి గుంతల్లో రోడ్లు పై పెద్ద పెద్ద పామాయిల్, ఇసుక, మట్టి తోలకాలు వాహనాల్లో తరలించడంతో ఆ గుంతలు ఇంకా పెద్దగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.



గోతులమయంగా రహదారి



నీటిమయంగా గోతులు



రహదారిపై వర్షపు నీరు

సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు
జి.రాజు, సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు



మండల కేంద్రమైన ముసునూరు మీదుగా ఏలూరు వెళ్లే ఆర్‌అండ్‌బి ప్రధాన రహదారి చాలా అధ్వానంగా మారడంతో పలు గ్రామాల్లోని ప్రజలు రాకపోకలు సాగించడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలి. లేకపోతే సిపిఎం తరపున త్వరలో నిరసనలు, ధర్నాలు చేపడతామని తెలిపారు.

అధికారులు స్పందించాలి
సిపిఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్



కూటమి ప్రభుత్వం వచ్చి 16 నెలలు గడిచినా నేటి వరకు కనీసం గుంతలు కూడా పూడ్చలేదు. ఏలూరు నుంచి నూజివీడు, మండల కేంద్రమైన ముసునూరు నుంచి గోపవరం, కాట్రేనిపాడు, సింహాద్రిపురం, ఇలా పలు గ్రామాలకు వెళ్లాలంటే నరకం కనిపిస్తుంది. ఇప్పటికైనా అధికారులు, రాజకీయ నాయకులు వెంటనే స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

7న ఫ్యాప్టో ధర్నాకు పూర్తి మద్దతు

ఎపి స్కూల్ టీచర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల ఏడో తేదీన ఫ్యాప్టో చేస్తున్న రాష్ట్రస్థాయి ధర్నాకు ఎపి స్కూల్ టీచర్స్ అసోసియేషన్ పూర్తి మద్దతు ఇస్తుందని ఎపి ఎస్‌టిఎ రాష్ట్ర సహాధ్యక్షులు జిజెఎ స్టీవెన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటి వెంకటరమణ, తోట ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడిచినప్పటికీ ఇప్పటివరకు ఒక్క డిఎ కూడా ప్రకటించలేదని, ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల సవతితల్లి ప్రేమ చూపిస్తుందని, ఇది ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదని, వెంటనే పెండింగ్ డిఎలు, ఇస్తూ పిఆర్‌సి కమిషన్ వేసి ఐఆర్ ప్రకటించాలని తెలిపారు. తమ ప్రభుత్వం రాగానే పెండింగ్ బకాయిలన్నీ చెల్లిస్తామని, మంచి ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి ఇస్తామని, ఐర్ ప్రకటిస్తామని మేనిఫెస్టోలో కూడా పెట్టి 16 నెలలు పూర్తయినా ఇప్పటికీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రయోజనాలు ఒకటి కూడా రాలేదని పేర్కొన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులు ఈ ప్రభుత్వం ఏర్పాటులో కీలకమైన పాత్ర పోషించారని, కూటమి ప్రభుత్వం ఇది గమనించాలని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని ఉద్యోగ ఉపాధ్యాయ న్యాయమైన డిమాండ్లను తీర్చాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఫ్యాప్టో, జెఎసి ఆధ్వర్యంలో ఉద్యోగ ఉపాధ్యాయులందరూ వివిధ రూపాల్లో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని తెలిపారు.

క్రీడాకారులకు దుస్తుల బహూకరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు మండల పరిధిలోని అన్నవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూజివీడు ఉపవిద్య శాఖాధికారి డాక్టర్ పివిఎస్.సుధాకర్ చేతుల మీదుగా స్కూల్ గేమ్స్ ఆటల్లో పాల్గొనే క్రీడాకారులకు క్రీడాదుస్తులు అందించారు. ఇదే స్కూల్లో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులు బివివిఎస్‌వి.ప్రసాద్ రూ.ఐదు వేల విలువైన క్రీడాదుస్తులు స్పాన్సర్ చేశారు. ఇంతకు ముందు ఆగష్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు రూ.వెయ్యి విలువైన క్రీడా సర్టిఫికెట్స్‌ను, పదో తరగతి విద్యార్థులకు రూ.1500 విలువైన స్టడీ మెటీరియల్ కూడా అందించినట్లు పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు పి.రవీంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేంద్రం, నాగరాజు, ఫిలోమిన, దుర్గామల్లేశ్వరరావు, జయకుమారి, శ్రీ మంగలక్ష్మి, రాజేంద్రప్రసాద్, కృష్ణకుమారి పాల్గొన్నారు.

మహిళల కోసం పోరాడిన జయప్రదమ్మ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

చలసాని జయప్రదమ్మ మూడో వర్ధంతి ఆదివారం నూజివీడు పట్టణంలో ఆమె స్వగృహం వద్ద నిర్వహించారు. జయప్రదమ్మ నూజివీడు తాలూకాలో కమ్యూనిస్టు ఉద్యమానికి, మహిళల హక్కుల పోరాటానికి ఎంతో కృషి చేశారని పలువురు తెలిపారు. సిపిఐ నూజివీడు సీనియర్ నాయకులు చలసాని జగన్నాధరావు భార్యగా కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాల్లో ఆయనతో పాటు చాలా ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. మహిళల హక్కుల కోసం, మహిళల కోసం ఎన్నో పోరాటాల చేసినట్లు చెప్పారు. జయప్రదమ్మ జీవించినంత కాలం ప్రతి ఏడాది ప్రతిరోజూ ఇంట్లో మిగిలిన డబ్బులను ముంతాలో దాచిపెట్టి సంవత్సరం పూర్తవక్కగానే పార్టీ నిధిగా ఇచ్చేది. ఈ సంవత్సరం కూడా ఈ ఆనవాయితీ కొనసాగిస్తూ వారి కోడలు చలసాని కృష్ణతులసి రూ.పది వేలు నూజివీడు పార్టీ నిధికి ఇచినట్లు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూజివీడు పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు పాల్గొన్నారు.

అమరావతి నిర్మాణానికి ఉపాధ్యాయుల విరాళం

ప్రజాశక్తి - ముదినేపల్లి

అమరావతి నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని ఎంఇఒ డి.రామారావు అన్నారు. స్థానిక వైష్ణవి మనోజ్ హాస్పటల్ ప్రాంగణంలో ఎంఇఒ డి.రామారావు అధ్యక్షతన జరిగిన చేయి చేయి కలుపుదాం అమరావతిని నిర్మిద్దాం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి భావితరాల కోసం పడుతున్న తపన ఈ కార్యక్రమంలో కనిపిస్తుందన్నారు. ఎటువంటి అవినీతికి తావు లేకుండా కేవలం రూ.116 నేరుగా సిఆర్‌డిఎ ఖాతాకే క్యూఆర్ కోడ్ ద్వారా అందించవచ్చన్నారు. అనంతరం మండలంలోని ఉపాధ్యాయులు తమ వంతు వివరాలను ఎపి సిఆర్‌డిఎ బ్యాంకు ఖాతాకు క్యూఆర్ కోడ్ ద్వారా విరాళాలు పంపించారు. ఈ సందర్భంగా మండలంలోని 60 మంది ఉపాధ్యాయులు, విద్యావేత్తలు పాల్గొని రూ.20 వేల విరాళాలను సిఆర్‌డిఎ ఖాతాకు పంపారు. విరాళాలు సిఆర్‌డిఎ ఖాతాకు పంపించిన ఉపాధ్యాయులందరినీ డాక్టర్ మనోజ్ పాదాలు కడిగి, శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపల్స్ బలుసు రఘురామయ్య. కె.సత్యనారాయణ, వేమూరు కృష్ణారావు. కోడూరు అర్జునరావు, తదితరులు పాల్గొన్నారు.



విరాళాలు పంపుతున్న ఉపాధ్యాయులు

ఏజెన్సీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

ఆదివాసీ సంక్షేమ పరిషత్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ సలహాదారు కోర్స వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని సిర్రివారిగూడెం గ్రామంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన, పీసా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. అనంతరం ఆదివాసీ రాష్ట్ర కార్యదర్శి కాకి మధు మాట్లాడుతూ పలు ప్రాజెక్టులు, పరిశ్రమల పేరుతో ఏజెన్సీ ప్రాంత వాసులను నిర్వాసితులు చేయొద్దని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ రిజర్వేషన్‌తో రాజకీయ పదవులు పొంది ప్రభుత్వ తొత్తులుగా పని చేస్తూ ఆదివాసీలకు అన్యాయం చేయడం తగదని విమర్శించారు. ఏజెన్సీ గ్రామాల్లో ఉంటున్న ఆదివాసీలు విద్యా, ఉద్యోగాలు, రాజకీయాల్లో రాణించాలని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ చట్టాల అమలు కోసం అందరం ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ టీచర్స్ సంక్షేమ పరిషత్, విద్యార్థి సంక్షేమ పరిషత్ నాయకులు కె.శ్రీను, జయబాబు, టి.రాములు, వెంకటేష్, ఎన్.శంకరం, పి.వెంకటేష్, కృష్ణ, కామరాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న నేతలు

తప్పుడు కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలి

మాల మహానాడు

ప్రజాశక్తి- ముదినేపల్లి

గుంటూరు జిల్లా నంబూరులోని ఐఒసిఎల్ బంక్ డీలర్ మదిర స్టీవెన్‌బాబును ఆ సంస్థ ఏరియా సేల్స్ ఆఫీసర్ వెంకట శివ తప్పుడు కేసులతో వేధింపులకు గురి చేస్తున్నాడని, తప్పుడు కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సేవ నాగ జగన్ బాబూరావు కోరారు. ముదినేపల్లిలోని మాల మహానాడు కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎస్‌సి సామాజిక తరగికి చెందిన స్టీవెన్ బాబును డీలర్ షిప్ నుంచి తప్పించేందుకు సేల్స్ ఆఫీసర్ వెంకట శివ కుట్ర చేస్తున్నారని విమర్శించారు. వెంటనే స్టీవెన్ బాబు అతని తండ్రి శేషయ్యపై పెట్టిన తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలన్నారు. వెంకట శివ గత రెండేళ్లుగా స్టీవెన్ బాబును వ్యక్తిగత కక్షతో వేధింపులకు గురి చేస్తున్నాడని, కంపెనీ రాయితీలు రానివ్వకుండా బంకు నిర్వహణలో అడ్డంకులు సృష్టించాడని చెప్పారు. తప్పుడు కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని, బంకును స్టీవెన్ బాబుకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కులం పేరుతో దూషించిన వెంకట శివపై ఎస్‌సి అట్రాసిటీ యాక్ట్ కేసు నమోదు చేసి బాధిత దళితులకు న్యాయం చేయాలని, లేకపోతే ఈ విషయాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతాని చెప్పారు.

ఆదివాసీ సంక్షేమ పరిషత్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కుక్కునూరు

ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్ష కార్యదర్శులుగా సరియం ప్రసాదరావు, రఘుబాబ తెలిపారు. మండల ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూర సంజీవరావు నాయకత్వంలో ఆదివారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా సరియం ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శిగా రఘుబాబు, ఉపాధ్యక్షులుగా వెట్టి వెంకన్న, సహాయ కార్యదర్శిగా కుంజ ముత్తయ్య, కోశాధికారిగా పైడ చిన్నబాబు, కార్యవర్గ సభ్యులుగా పలువురు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను మాట్లాడుతూ ఆదివాసీ జాతి మనుగడ, చట్టాల రక్షణ కోసం ఐక్యతతో ఉద్యమించాలని, 1/70 చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, అక్రమ కట్టడాలను తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు పోడియం వేణుగోపాల్, పైడ బొర్రయ్య, పూజారి లక్ష్మీనారాయణ, కురం ప్రసాద్, తుర్స నరసింహరావు, కొర్రి సీరమయ్య, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్.అప్పారావు కాలనీల్లో సమస్యల వెల్లువ

ఇబ్బందుల్లో కాలనీ వాసులు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంలో అతి పెద్ద కాలనీగా డాక్టర్ ఎంఆర్.అప్పారావు కాలనీని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. కనీస సౌకర్యాలకు దూరంగా అసౌకర్యాలకు నిలయంగా నివసించేందుకు దుర్భరంగా తయారైందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ ఏర్పడి దాదాపు 25 ఏళ్లవుతున్నా రోడ్లు లేక, కచ్చా డ్రెయినేజీలు లేక, డ్రెయినేజీ నిర్మాణం జరగక మురుగునీరు ఇళ్ల ముందు, ఖాళీ స్థలాల్లో ప్రవహిస్తూ నిల్వ ఉండడంతో దోమల బెడద విపరీతంగా పెరిగిపోయిందని వాపోయారు. పెరిగిన దోమల కారణంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాల బారిన పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీవాసులు వివరించారు. ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదల కారణంగా విషసర్పాలు పెరిగి జీవించడం ఎంతో దుర్భరంగా తయారైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి ఆవరణలోని మరుగుదొడ్లకు వెళ్లాలన్నా కర్రలు లేనిదే వెళ్లలేని స్థితి ఏర్పడిందని మహిళలు వాపోతున్నారు. సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేకపోయిందని గోడు వెళ్లబోసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అతి పెద్ద కాలనీగా విరాజిల్లిన నూజివీడు పట్టణంలోని డాక్టర్ ఎంఆర్ అప్పారావు కాలనీలో సౌకర్యాలను కల్పించి, తమను రక్షించాలని కాలనీవాసులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.



అధ్వానంగా కాలనీ



పేరుకుపోయిన ముళ్ల పొదలు

జిల్లాలో యాక్ట్ 30 అమలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లా వ్యాప్తంగా యాక్ట్ 30 అమల్లో ఉందని ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడ సభలు నిర్వహించాలని, పోలీసులు అనుమతి తప్పనిసరని లేకుంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు చేపడతామని తెలిపారు. ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ఆదేశాల మేరకు ఈ నెల ఒకటో తేదీ నుంచి 18వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఉందని గుంపులుగా తిరిగేందుకు సభలు, సమావేశాలు, ఏర్పాటు చేసేందుకు ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఎవరైనా అత్యవసరంగా ర్యాలీలు సభలు నిర్వహించాలని అనుకుంటే ముందస్తు పోలీసులు అనుమతి కచ్చితంగా తీసుకోవాలని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరు ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఒకవేళ ఏదైనా సమావేశానికి సభకు అనుమతి ఇచ్చిన తర్వాత శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం ఉంటే వెంటనే ఈ అనుమతులను రద్దు చేసే అవకాశం ఉందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

33/11 కెవి కొత్తపల్లి సబ్ స్టేషన్‌లో ఉన్న 11 కెవి కొత్తపల్లి ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు చినవాడవల్లి, వాడవల్లి గ్రామాల్లో విద్యుత్ లైన్స్‌కు దగ్గరలో ఉనన చెట్లను కొట్టనున్నట్లు ముదినేపల్లి విద్యుత్ శాఖ ఎఇ పూర్ణచంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లోని గృహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదారులకు ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ సహకరించాలని కోరారు.

చింతలపూడి మండలంలో

చింతలపూడి : ఈ నెల ఆరో తేదీ సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆర్‌డిఎస్‌ఎస్ వర్క్స్ నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జంగారెడ్డిగూడెం ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరో తేదీన శెట్టివారిగూడెం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి శెట్టివారిగూడెం 24 గంటల ఫీడర్‌కు మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు, 11 కెవి నామవరం ఫీడర్‌కు, శంఖుచక్రపురం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి తిమ్మిరెడ్డిపల్లి ఫీడర్లకు ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆర్‌డిఎస్‌ఎస్ వర్క్స్ నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

'ఆటో డ్రైవర్ల సేవలో' సంబరాలు

ప్రజాశక్తి - దెందులూరు

ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం సంబరాలు దెందులూరులో రెండో రోజు సైతం కొనసాగాయి. ఆదివారం ఉదయం పెదవేగి మండలం పినకడమి గ్రామంలో యువశక్తి ఆటో ఓనర్స్, వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన "థాంక్యూ" కార్యక్రమంలో ఆటో డ్రైవర్ సోదరులతో కలిసి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన తరగతులకు శ్రామిక, కార్మిక సహా అన్ని రంగాలకు చెందిన ప్రతిఒక్కరికీ కూడా కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలిచి వారి సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తుందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ చిత్తశుద్ధితో కృషి చేసి అండగా నిలుస్తుందని తెలిపారు. మహిళలకు ఉచిత ఆర్‌టిసి బస్సు ప్రయాణం ద్వారా ఉపాధి తగ్గిన గ్రామీణ ప్రాంతాల ఆటోడ్రైవర్లకు సైతం ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.